నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 17 జనవరి 2025 | SURYAPET

అర్వపల్లి మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలో పారని గోదావరి జలాలు

ఎస్సారెస్పీ ఆయకట్టులో సాగునీటి ఇక్కట్లు

అరకొర నీళ్లిచ్చి చేతులు దులుపుకొంటున్న ప్రభుత్వం

- చివరి మండలాలు, గ్రామాలకు చేరని గోదావరి జలాలు
- ఇప్పటికే నీళ్ల కోసం ఆందోళనలు, ధర్నాలు చేస్తున్న రైతాంగం
- గత యాసంగిలోనే నీళ్లు ఇవ్వక పంటలు ఎండిబెట్టిన రేవంత్ సర్కారు
- ఈ యాసంగిలోనూ 50 శాతం పంటలు ఎండే ప్రమాదం?

కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతును సాకుగా చూపి నిర్లక్ష్యం

సూర్యాపేట, జనవరి 16(నమస్తే తెలంగాణ) : సాగు నీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. అన్ని వనరులున్నా నీటి విడుదల చేయడంలో అలసత్వం, అసమర్థ ప్రదర్శిస్తున్నది. గత ప్రభుత్వంపై బదనాం చేయడంలో భాగంగా కుట్రలు చేస్తున్నది. సూర్యాపేట జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటి విడుదల చేయకపోవడంతో పంటలు పండే పరిస్థితి లేకుండా పోయే ప్రమాదం కనిపిస్తున్నది. గత యాసంగిలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న సాకు చూపి సాగునీటిని విడుదల చేయకపోవడంలో వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయిన విషయం తెలిసిందే. ఈ యాసంగిలోనూ అరకొర నీటి విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నది. ఆన్ అండ్ పద్ధతిలో నీటి విడుదల చేయడంతో అవి ముందున్న మండలాలకు నీళ్లు చేరి చివరి మండలాలకు రాని పరిస్థితి ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరాయంగా నీటి విడుదల చేయడంతో రెండు సీజన్‌లలో పంటలు పుష్కలంగా పండాయి. అదే మాదిరిగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం కుట్ర పూరితంగా వ్యహరిస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నది.గత వానకాలంలో కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో నీళ్లు ఉండడంతో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ప్రస్తుతానికి నాట్లు వేసినప్పటికీ పంట చేతికి వచ్చే సమయానికి నీళ్లు అందకపోవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారుల ద్వారా తెలుస్తున్నది. గతంలో కాళేశ్వరం పంపుల నుంచి వచ్చే నీళ్లు సప్పోర్ట్ ఇవ్వడంతోనే పంట చేతికి వచ్చే వరకు నీటిని ఇవ్వగలిగామని, ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువ ఉన్నందున పూర్తి స్థాయిలో ఇవ్వడం కష్టమని చెబుతున్నారు. ఇలాగే కొనసాగితే ఈ యాసంగిలో జిల్లాలో 50శాతం ఎస్సారెస్పీ ఆయకట్టు ఎండడం ఖాయంగా కనిపిస్తుంది.

బీఆర్ఎస్ హయాంలో సస్యశ్యామలం

గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలతోపాటు రైతన్న బలపడ్డాడు. దశాబ్దాల తరబడి నీటి చుక్కకు నోచుకోని భూముల్లోకి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు పారించి సస్యశ్యామలం చేశారు. ఏడాదికి రెండు సీజన్‌లకు నిరంతరాయంగా నీళ్లు అందించి పంటలు పుష్కలంగా పండేలా చేశారు. యాసంగిలో మూడు నెలలు అంటే దాదాపు 85 నుంచి వంద రోజుల పాటు 30 నుంచి 40 టీఎంసీల చొప్పున నీటిని విడుదల చేశారు. దాంతో ఒక్క సూర్యాపేట జిల్లాలోని 2.95లక్షల ఎకరాల్లో వరి పంట పండింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి యాసంగికి గోదావరి జలాలు రాకపోవడంతో వరి పంటలు ఎండిపోయిన విషయం తెలిసిందే. దీంతో దాదాపు పదేండ్ల తరువాత ప్రభుత్వంపై రైతుల ఆందోళనలు, ప్రతిపక్షాల నిరసనలు పునరావృతమయ్యాయి. కాగా కాంగ్రెస్ పాలనలో రెండో సారి వస్తున్న ప్రస్తుత యాసంగికి కూడా గోదావరి జలాల విడుదలపై అయోమయం కనిపిస్తున్నది.

గోదావరి జలాలు రాక అర్వపల్లి మండలం కొమ్మాలలో ఎండిపోయిన పాలబిందెల చంద్రయ్య రైతుకు చెందిన మూడెకరాల పొలం

నాట్ల దశలోనే నీటి కష్టాలు

ఈ యాసంగిలో దుక్కులు దున్ని నాట్లు వేస్తున్న రైతాంగం తొలి దశలోనే నీళ్ల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టే దుస్థితి నెలకొంది. ఎస్సారెస్పీ కాల్వల నుంచి ఇటీవల వారం రోజుల పాటు నీటిని విడుదల చేయగా సగం పొలాలకు కూడా చేరుకోలేదు. అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నాగారం మండలాలతోపాటు చివ్వెంల, నడిగూడెం, మునగాల, పెన్‌పహాడ్ మండలాల్లోని చాలా వరకు కాల్వల్లో నీళ్లు పారడం లేదు. బావులు, బోర్ల కింద ఇప్పటికే వేసి నాట్లు ఎండిపోతున్నాయి. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో కాల్వల్లో నీళ్లు రావడం లేదని, వేసిన నాట్లు ఎండిపోతున్నాయని ఇప్పటికే రైతులు ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

ప్రభుత్వం అప్రమత్తం కాకుంటే భారీ నష్టం

చిన్న సాకును చూపి కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టడంతో గత యాసంగిలో జిల్లాలోని వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయిన విషయం విదితమే. ఇటీవల వానకాలంలో వర్షాలు కురవడంతో పంటలకు ఏ ఢోకా లేకుండా పోయింది. కానీ ఈ యాసంగిలో గత యాసంగి మాదిరిగా పరిస్థితులు పునరావృతమయ్యేటట్లు కనిపిస్తున్నాయి. నీటి నిర్వహణ విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండని పక్షంలో పంటలకు భారీ నష్టం చేకూరే ప్రమాదం ఉన్నది. సూర్యాపేట జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నేరుగా నీరు పారేవి 2.50 లక్షల ఎకరాలు, ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటల కింద మరో 45వేలు ఎకరాలు మొత్తం 2.95 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. యాసంగిలో పంటలు పూర్తి స్థాయిలో చేతికి అందాలంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లు నీటిని సరఫరా చేయాలని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రైతుల విషయంలో రాజకీయం తగదు

రైతులు, పంటల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయకూడదు. ఏదో లబ్ధి పొందాలని నీటి నిర్వహణను గాలికి వదిలేసినా, చిన్న సాకు చూపించి కాళేశ్వరం నుంచి నీటిని పంపింగ్ చేయండా పంటలను ఎండబెట్టినా రైతులే ప్రభుత్వ పెద్దలను నిలదీస్తరు.. ఉరికించి తరిమికొడ్తరు జాగ్రత్త. బీఆర్ఎస్ హయాంలో దాదాపు ఆరేండ్ల పాటు ఏటా రెండు పంటలకు పుష్కలంగా నీటిని ఇచ్చి పంటలను కాపాడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంటలను ఎండబెడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాలు వెచ్చించి ప్రాజెక్టును నిర్మిస్తే చిన్న బ్యారేజీ మరమ్మతుల పని చేయించలేని దద్దమ్మలాగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అబద్ధాలు మాని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి రైతులను అదుకోవాలి తప్ప రాజకీయాలు చేస్తూ తప్పుడు ప్రచారం మానుకోవాలి. రైతులకు నష్టం చేకూరితే వారి వెంట బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుంది.

– గాదరి కిశోర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, తుంగతుర్తి

ఎస్సారెస్పీ పూర్తి స్థాయిలో నీటిని అందించాలి

- కాల్వలో దిగి రైతుల నిరసన

నూతనకల్ : ఎస్సారెస్పీ ఆయకట్టుకు ప్రభుత్వం సరిపోను నీళ్లు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నూతనకల్ మండలానికి చెందిన పలువురు రైతులు గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థానిక ఎస్సారెస్పీ కాల్వలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు గాడుదల లింగరాజు మాట్లాడుతూ గతంలో రైతులకు సక్రమంగా సాగునీరు అందేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చడం లేదని తెలిపారు. గోదావరి జలాలు రాకపోవడంతో పంటలు ఎండే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే సాగునీటిపై దృష్టి పెట్టాలని కోరారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరుగు అంజయ్య, నాయకులు నారాయణ, అనిల్, లింగ య్య, రామస్వామి, రైతులు మల్లయ్య, వెంకన్న, భిక్షం, అశోక్, శ్రీను తదితరులు ఉన్నారు.

నూతనకల్ మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, తదితరులు

నార్మూల్ స్థిరాస్తులు విక్రయిస్తే ఊరుకోం

- పాడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- గతంతో పోలిస్తే 50 శాతం తగ్గిన నార్మూల్ పాల విక్రయాలు
- మీడియా సమావేశంలో నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి16 : నార్మూల్ సంస్థకు చెందిన స్థిరాస్తులు విక్రయించేందుకు ప్రస్తుత పాల కవర్గం తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, రైతుల డబ్బులతో కొనుగోలు చేసిన భూములను విక్రయానికి పాల్పడితే ఊరుకునేది లేదని నార్మూల్ తాజా మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి అన్నారు. గత నాలుగు నెలలక్రితం జరిగిన పాలక మండలి ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి నార్మూల్ సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. యాదగిరి పట్టణంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నార్మూల్ సంస్థకు చెందిన చిట్యాలలో 32 ఎకరాలు, మిర్యాలగూడలో 1.20 ఎకరాల భూమి దాదాపుగా రూ. 75 కోట్ల ఆస్తులను ప్రస్తుత చైర్మన్ విక్రయించి నార్మూల్ సంస్థను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలేరు నియోజకవర్గంలో ఎక్కువ పాడిపంటపైనే రైతులు ఆధారపడ్డారని, ఇక్కడి రైతులకు రోడ్డున పడేసేందుకు ప్రస్తుత పాల కవర్గం కుట్రలు చేస్తున్నదని తెలిపారు. నార్మూల్ సంస్థ రూ. 50 కోట్ల నష్టాల్లో ఉన్న సమయంలో తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానని, రోజుకు 40 వేల లీటర్ల పాల విక్రయాలను 1.20 లక్షల లీటర్ల వరకు పెంచి నష్టాలను అధిగమించే ప్రయత్నం చేశామని గుర్తు చేశారు. రెండేండ్ల పాలనలో తాను చేసిన అభివృద్ధిని ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. నాలుగు నెలల పాలనలో చేసిన అభివృద్ధిపై తాజా చైర్మన్ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గతంలో రోజుకు 95 వేల లీటర్ల పాలను మార్కెటింగ్ చేసి విక్రయాలు జరిపామని తెలిపారు. పాడి రైతుల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యంగా లీటరు పాలకు రూ. 5 పెంచామన్నారు. గత పాలక మండలి ఎన్నికల్లో స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు వచ్చి హామీలు గుప్పించారని, 300 మంది పాల సంఘం చైర్మన్లతో క్యాంపు నిర్వహించి వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. మమ్మల్ని గెలిపిస్తే రూ.5 బోనస్, రూ. 30 కోట్ల ప్రభుత్వ గ్రాంట్స్‌తోపాటు గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లిస్తామని హామీలిచ్చారని, నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు. గతంలో 95 వేల లీటర్లు విక్రయించినా నష్టాల్లో నడిచే సంస్థను ప్రస్తుతం కేవలం 45 వేల లీటర్ల విక్రయించి ఎలా అభివృద్ధి చేస్తారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లకు పాల సరఫరా, యాదగిరిగుట్ట దేవస్థానంతో పాటు చెర్వుగట్టు, వేములవాడ దేవస్థానాలకు నార్మూల్ నెయ్యిని రద్దు చేసి ప్రస్తుత ప్రభుత్వం సంస్థను దీనావస్థలోకి నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డెయిరీకే అన్ని అనుమతులివ్వడంతోపాటు రూ. 100 కోట్లు గ్రాంట్స్‌ను మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నార్మూల్ డెయిరీకి ఎందుకు ఇవ్వడం లేదో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే వివరణ ఇవ్వాలన్నారు. గుట్టకు నార్మూల్ నెయ్యిని రద్దు చేసి విజయ డెయిరీకి సరఫరాను అనుమతినిస్తుంటే ఇక్కడి ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. భూ దందాలు, భూములకు కొల్లగొట్టేపనిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. నార్మూల్ సంస్థను నాశనం చేసేందుకు భూములను విక్రయిస్తామంటే ఊరుకునేది లేదని, త్వరలో దీనిపై మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి వివరిస్తామని తెలిపారు. సమావేశంలో నార్మూల్ డైరెక్టర్ కందాల అలివేలు రంగారెడ్డి, మాజీ డైరెక్టర్లు వెంకటరామిరెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, పాల సంఘం చైర్మన్లు మారెడ్డి కొండల్‌రెడ్డి, సందిళ్ల భాస్కర్‌గౌడ్, గడ్డం భరత్‌గౌడ్, ఒగ్గు భిక్షపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కసాపు శ్రీనివాస్, ఉపసర్పంచ్ రేపాక స్వామి, నాయకులు పాండవుల భాస్కర్‌గౌడ్, పల్లె సంతోష్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వాహనాల రద్దీ

పట్నం వైపు తిరుగు ప్రయాణం

చౌటుప్పల్, జనవరి 16 : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరిగి పట్నం బాట పట్టారు. బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో బయల్దేరి వెళ్తుండడంతో గురువారం రహదారులు రద్దీగా మారాయి.

కేతేపల్లి మండలం కొర్లపహాడ్, చౌటుప్పల్ మండలం పంతంగా టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరి వెళ్లాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. హైవేపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

డుమ్మా ఉద్యోగులకు కలెక్టర్ మెమో

- కనుమ రోజున సగానికి పైగా డ్యూటీలకు రాని ఉద్యోగులు
- వర్కింగ్ డే అయినా విధులకు హాజరు కాలేదెందుకని సీరియస్
- కొంతమంది ఆఫీసులకు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిన పరిస్థితి

నల్లగొండ, జనవరి 16 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 13న భోగి, 14న మకర సంక్రాంతికి సెలవులు ఇచ్చిన ప్రభుత్వం 15వ తేదీన మాత్రం కనుమ రోజున వర్కింగ్ డేగా అమలు చేసింది. అంతకు ముందే ఆదివారం కలిసి రావడంతో సొంత ఊర్లకు వెళ్లిన ఉద్యోగులు బుధవారం మాత్రం ఆప్షనల్ హాలిడేగా పెట్టుకొని గైర్హాజరయ్యారు. ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతానికి పైగానే డ్యూటీల్లో లేకుండా డుమ్మా కొట్టారట. దీంతో సీరియస్ అయిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మెమోలు ఇచ్చి సంజాయిషీ కోరారు. మెమోలు ఇచ్చిన వారిలో ఉన్నతాధికారులే 14 మంది ఉండటంతో కలెక్టర్ సీరియస్ అయినట్లు సమాచారం. బుధవారం ఉదయమే కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యక్షంగా గుర్రంపోడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయగా ఎనిమిది మంది డ్యూటీలకు రాలేదు. దాంతో ఎలాంటి సమాచారం లేకుండా విధుల్లో పాల్గొనని ఎనిమిది మంది ఉద్యోగులను అక్కడిక్కడే సస్పెండ్ చేశారు. జిల్లాలోని అన్ని శాఖల్లోనూ కనుమ రోజున ఇదే తంతు జరిగిందని విధులకు హాజరైన ఉద్యోగులు చర్చించుకున్నారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి కాస్త ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆరా తీసిన ఆమె సంబంధిత అధికారులు, కింది స్థాయి ఉద్యోగులపైన సీరియస్ అయి మెమోలు జారీ చేశారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఉండే ఉద్యోగుల్లో కూడా సింహభాగం ఆఫీసుకు వచ్చి సంతకం చేసి ఇంటిబాట పట్టినట్లు ఇతర ఉద్యోగులు అంటున్నారు. వీరిపైనా ఆరా తీసి మెమోలు ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న వారి పట్ల కలెక్టర్ వేటు వేస్తుండటంతో ఉద్యోగుల్లో అలజడి కనిపిస్తున్నది. ఇటీవల ఓ జిల్లా అధికారిని సరెండర్ చేసిన ఆమె ఒక వ్యవసాయ అధికారితో పాటు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి పలువురికి మెమోలు జారీ చేశారు. ఈ నెల 14న కూడా గుర్రంపోడ్‌లో 8 మందిపై వేటు వేసిన ఆమె అదే రోజు డ్యూటీలకు రాని వారందరికీ మెమోలు ఇవ్వటం గమనార్హం.

పండుగ పూట ఆర్టీసీ బాదుడు

- స్పెషల్ బస్సుల పేరిట అదనపు చార్జీలు వసూలు

ఆత్మకూరు(ఎం), జనవరి 16 : సంక్రాంతి పండుగ పూట ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరిట ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. గతం కంటే 50శాతం చార్జీలు పెంచి ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్నది. గతంలో ఆత్మకూరు(ఎం) నుంచి రాయిగిరి వరకు ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.40 ఉండగా ఇప్పుడు 60 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఆత్మకూరు(ఎం) నుంచి ఉప్పల్ వరకు గతంలో రూ.120 ఉండగా, ఇప్పుడు రూ.180 తీసుకుంటున్నారు. పండుగకు ఊరెళ్దామంటే ఆర్టీసీ అధికారులు చార్జీలు పెంచి నిలువుదోపిడీ చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న పేదలు పండుగకు స్వగ్రామానికి వచ్చి పోయేందుకు పెంచిన చార్జీలను చూసి లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం పునరాలోచించి పండుగ పూట చార్జీలు పెంచకుండా చూడాలని కోరుతున్నారు.

అదనంగా చార్జీలు పెంచిన బస్సు టికెట్లు

రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు

ఇద్దరి ప్రాణాలు తీసిన లారీ

- నిర్లక్ష్యపు లారీ డ్రైవింగ్‌తో తల్లీ కూతురు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 16 : లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో కారులో వెళ్తున్న తల్లీ కూతుళ్లు మృతి చెందారు. వారి కుటుంబానికి చెందిన మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి పట్టణ పరిధి రాయగిరి బైపాస్‌లో హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రామ్‌తండాకు చెందిన భూక్యా సంతోష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చి గురువారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తున్నారు. రాయగిరి బైపాస్‌రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ బంకు దగ్గరకు రాగానే వెనకాల వస్తున్న కారును గమనించకుండా లారీ డ్రైవర్ ఒక్కసారిగా పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు ఎడమవైపునకు తిప్పాడు. దాంతో లారీ వెనకాల వస్తున్న కారు ఒక్కసారిగా లారీ వెనుక వైపు ఢీకొట్టి కిందికి దూసుకెళ్లింది. దీంతో కారులో ముందు సీట్లో కూర్చున్న భూక్యా అనూష (28), పెద్ద కుమార్తె భూక్యా చైత్ర(7) అక్కడికక్కడే మృతి చెందారు. భర్త సంతోష్, చిన్న కుమార్తె ప్రణశ్విని, ఆడపడుచు భవాని, ఆడపడుచు భర్త రవి, కుమార్తె మోక్షకు గాయాలయ్యాయి.

తల్లీ కూతురు అనూష, చైత్ర (ఫైల్)

విషయం తెలుసుకున్న రూరల్ సీఐలు చంద్రబాబు, సంతోష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామన్నపేటను మరో లగచర్లగా మార్చొద్దు

- సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించాలి
- సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రామన్నపేట, జనవరి16 : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే అంబుజా సిమెంట్ పరిశ్రమను రామన్నపేటలో ఏర్పాటు చేస్తే సహించేది లేదని, రామన్నపేటను మరో లగచర్లగా మార్చొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రామన్నపేట మండలకేంద్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలాన్ని గురువారం ఆయన స్థానిక సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం శోభానాద్రిపురం గ్రామంలో సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని, ప్రజాభిప్రాయ సేకరణ జరిగి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ రద్దు చేయడంలో ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి తన జీవితాన్నే పేదలకు అంకితం చేసిన సుందరయ్య విగ్రహాన్ని శోభనాద్రిపురంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహాంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, పైళ్ల ఆశయ్య, బట్టుపల్లి అనూరాధ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, మేక అశోక్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆ పార్టీ నాయకులు

సాగర్‌ను సందర్శించిన కైట్ ఫ్లయర్స్

నందికొండ, జనవరి 16 : అంతర్జాతీయ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్‌ను పలు దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్ గురువారం సందర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పతంగుల పండుగకు వచ్చిన 20 దేశాల కైట్ ఫ్లయర్స్ మూడు రోజుల కైట్ ఫెస్టివల్ అనంతరం తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌ను సందర్శించారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం చేరుకొని బుద్ధ చరిత వనం, జాతక పార్కు, మహాస్థూపం, ధ్యాన మందిరం చూశారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. వారితో టూరిజం అధికారి లోకేశ్, టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మహా స్తూపం వద్ద కైట్ ఫ్లయర్స్